**యౌవనంలో వున్న స్త్రీ గుండెల 'ఎత్తు' మగవాడికి 'మత్తు'ను కలిగిస్తుంది. అతను కేవలం మగవాడుగా కాక మనిషిగా ఎదిగినప్పుడే ఆ ఎత్తు గుండెల్లో పొంగే మహత్తర త్యాగం అర్థమవుతుంది!**

"జర ఆగుండీ! తారు కాగనేదింకా."

యానాది కేకతో కూలీలందరి మొహాలు వికసించాయ్. కాసేపు చెట్టు నీడకి పోవచ్చును. రోహిణి ఎండకి శరీరంలో రక్తంకూడా నల్లగా మాడిపోతోంది. తరతరాలుగా కలవారి సౌఖ్యంకోసం బతుకులు అంకితం ఇచ్చుకునే మూగజీవులు ఆ ఎండలో నడిచే శవాల్లా రోడ్డు వేస్తున్నారు.

రోడ్డుకి కాస్త దూరంలో వల్లానికి పచ్చగా విస్తరించుకునివున్న చెట్టు ఒకటి పెట్టుబడిదారీ వర్గానికి చెందిన మనిషిలా గుమ్మటంలావుంది. గానయితే దాన్కింద కూలీలు బిలబిలా పరిగెత్తుకుంటూ వచ్చి, ఆరిపోయిన గొంతు తుల్పి ఆ నీడతోనే తడుపుకుని సేదదీరుతున్నప్పుడు మాత్రం అది గోవర్ధన పర్వతాన్ని చిటికెనవేలు మీద ఎత్తిపట్టుకున్న క్రిష్ణుడిలాగానూ, శ్రమజీవుల విలువ ఎరిగిన మనిషి జాలిగుండె లాగానూ కూడా అన్పిస్తోంది.

అదే రోడ్డుకి చివరగా ఫర్లాంగు పైగా దూరంలోచిన్నరోడ్డు విడిపోయిన మలుపు లాంటి దగ్గర ఎత్తుగా నల్లటి తారు బాయిలర్ సంతృప్తి ఎరుగని దురాశాపరుడిలా పెగలు గక్కుతోంది.

అక్కడ తారు మరగటం అనేఆలస్యం వుందని యానాది అధికారపూర్వకంగా ప్రకటించగానే ఆదరాబాదరా చెట్టు కిందకి పరిగెత్తిన కూలిజనం చుట్టలు బయటకి లాగారు. ఆడవాళ్ళు అడ్డపొగల కుతి తీర్చుకుంటున్నారు. అనాథ శరణాలయంలో బతికే పిల్లల్లా మిక్సర్ దగ్గర గమాళాలు తారు మొహాల్తో నిలబడి పోయినాయ్.


బాయిలర్ నల్లటి పొగ వలయాలు వలయాలుగా ఆ ప్రదేశాన్ని చుట్టేసి, ఆ పొగలోంచి వాళ్ళంతా ఏదో యుగానికి చెందిన మనుష్యుల్లా కన్పించసాగారు. ఇటువైపు రోడ్డు మీంచి కారు డ్రైవ్‌చేసుకుంటూ వస్తోన్న విజయబాబుకి దగ్గు రాబోయింది. తక్షణం కారు బ్రాక్‌చేసుకున్నాడు. భారత దేశపు ప్రగతిలా వెనక్కి నడిచి ఆగింది కారు. రెండు నిమిషాల తర్వాత కూలింగ్ గ్లాసెస్ అమర్చబడివున్న తలుపు తెర్చుకుని, మబ్బుల పరదాలు ఎడంచేత్తో తొలగించుకుంటూ బయటకు వచ్చే చందమామలా కారుదిగాడు విజయ్. అతను నిలబడినచోట రోడ్డు కటూ, ఇటూ పెద్ద పెద్ద వృక్షాలు దట్టంగా పెనవేసుకుని అతి చల్లదనాన్ని వ్యాపింపజేస్తున్నాయి. ఎండకి తడిసిన పక్షులు కొమ్మల్లో దూరి కిచకిచలాడ్తున్నాయి. వసంత కాలపు కోయిల కుహూః అంటోంది మత్తుగా. గాలిలో ఎక్కడినించో వాగు గలగలలు ప్రేయసి నవ్వుల్లా తేలి తేలి రాసాగినాయ్.

కన్నెపిల్ల కలలు కనే కళ్ళల్లా ఆ వాతావరణం అతిమనోహరంగా వుందిగానీ విజయ్ మొహం మాత్రంతుమ్మల్లోకి దిగిపోతోన్న పొద్దులా వుంది.

కళ్ళజోడు అమితాబ్ స్టయిల్లో చూపుడు వేలి కొనతో సుతారంగా కనుబొమల మధ్య అదిమి సరిచేసుకుంటూ కారుకు ఆనుకుని నిలబడ్డాడు.

అందమైన కలగంటూ వుండగా బలవంతాన ఎవరో కుదిపిలేపినట్టు తిక్కగా వుంది అతనికి. మునిపంటిక్రింద పెదవి నలిగిపోతోంది. "బ్లడీ!".... అనుకోసాగాడు కసిగా.... విస్సహాయంగా. సరిగ్గా పదిగంటలకి నిద్రలేచాడు. రాత్రి పార్టీ తాలూకు హంగోవర్ ఇంకా వదలనే లేదు. హాయిగా షవర్‌కింద కూర్చుంటే తల్లో బూజులా చేరుకున్న మత్తు తెరలు మెల్లగా వదిలేసినట్టు అన్పించింది. తెల్లటి జలతారు పనితనంవున్న లాల్చి, షరాయీ వేసుకున్నాడు. డ్రీమ్‌గాల్ హేమమాలినికి ఇష్టం అని తనూ ఇష్టపడుతోన్న 'చెరిస్టన్ ఎస్టెవెండర్' పెర్ఫ్యూమ్ తో. ఎల్. ఎస్. డి. కన్నా వెయ్యిరెట్లు మత్తు అందించే అమెరికన్ మాగజైన్ చదువుకుంటూ యూఫోమ్ ఉయ్యాల్లో పయనించి ఆ పుస్తకంలో సాహిత్యం వొరిపిడికి తపిస్తూ పడుకుని వున్న తను, ఇప్పుడు యిలా ఈ నరకంలోకి వచ్చి పడటానికి

శబ్దార్థ చంద్రిక



# ఎత్తుగుండెలు

పి. పద్మజవాణి



కారకుడైన తండ్రిమీద చెప్పలేనంత కోపంగా వుంది.

"బ్లడీ ! బాధ్యతలు తెలియాల్ట నాకు. బాధ్యతలు. తను సంపాదించే లక్షలన్నీ యెవరికోసమో ? ఒక్కగానొక్క బిడ్డ వనే జాలికూడా లేకుండా పోయింది డాడీకి." అలా అనుకోగానే విజయ్ మొహం వుక్రోషంతో ఎర్రబడిపోయింది.లీలగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాస్త వదిలితేచాలు మనసు రెక్కలుగట్టుకొని ఎగిరివెళ్ళి అతని గదిలో మంచం దగ్గర ఎయిర్ కూలర్ విరజిమ్మే మంచి గంధపు మాలికలదగ్గరకి పరిగెత్తుతోంది. బలవంతంగా నిగ్రహించుకోటంతో విజయ్ దవడ ఎముక కరకరా చప్పుడు చేసింది. కానీ ఎదురుగుండా చేదు నిజంలా సుళ్ళు తిరుగుతూ లేస్తోన్న బాయిలర్ పొగ తండ్రి మందలింపుల్లా తోచి కోపం ఖస్సుమంటూ పడగవిప్పింది. వెంటనే చెయ్యి జాపి హారన్ మోగించాడు. కూలీలకి అదే గుర్తు.

"అయ్యగారు ఒత్తన్నారు. కారొచ్చేసినాదిరోయ్...." కాళ్ళు తొక్కుకుంటూ రోడ్డుమీదకి పరిగెత్తుకొచ్చారు.

వియంత ఆఖరి క్షణాల్లా పొగ మెల్లగా అంతరించిపోయింది.

సన్నాసి బకెట్ పట్టుకుని బాయిలర్ వయిపుగా నడవసాగాడు. అప్పుడే కొద్దిగా నీడ సుఖం మరిగినశరీరం వుసూరుమంది. మిక్సర్ డ్రయివర్ హుస్సేన్ కారు హారన్ విన్పించగానే ఎంతసేపటినించో ఆ పనిలో చాలా దీర్ఘంగా మునిగిపోయినట్టు సరిగ్గా వున్న "నట్లు" మళ్ళీ మళ్ళీ తిప్పుతూ స్టంటు చేశాడు. అంతలోనే బాగయినట్టు సంతృప్తిగా ఓసారి మిషిన్ లోకి ఒంగి చూసి ఫైనల్‌గా ఓ కేక పెట్టాడు.

"ఒరే సన్నాసిగా ! మిచ్చరు బాగయింది బే? పన్లో సద్దుకోండ్రా నాయాల్లాలా"—

హుస్సేను సంగతి కనిపెట్టి ఎగతాళిగా నవ్వాడు సన్నాసి. "ఓసోసీ, బాగయిందటే మిస్సెరు" వాడలా సాగదీస్తూ వెక్కిరించగానే హుస్సేను కోసారి నిజంగానే కోపం ఎగదన్నింది.

"అడిస్తున్నది పెద్దయ్యగారయ్యే ! అడుకుదొబ్బుతున్నారా నా కొడుకుల్లారా?" అని రంకెలేసేస్తాడు.

"ఏటదీ? ఏలాకోలం శీకాకోలమవుద్ది బే ! బేగితూడు.. తారు కాగినాదా! లేదా?"

"నేదింకా ! జర్రుండాల" హుస్సేను తిరుపు కళ్ళవయిపు భయంగా చూశాడు. ఈసారి ఇద్దరూ అనుకోకుండా ఒకేసారి రోడ్డుకేసి దృష్టి సారించారు. "దావే ! రోడ్డు బాగయినాదామీ్మ."

దాలమ్మ చెంగుతో మొహం ఒత్తుకుంటూ కూర్చున్నదల్లా వాళ్ళ హెచ్చరిక విని లేచింది. నేల మీద బ్రష్షు అందుకుని మళ్ళీ ఓసారి రోడ్డు దులిపేసి అయిందన్నట్టుగా తలూగించింది.

కళ్ళముందు తయారయిన రోడ్డు తెల్లటి ఇసుక చల్లుకుని మెలికలు తిరుగుతూ పరిగెత్తి వస్తోన్న గోధుమ త్రాచులా భ్రమ కలిగిస్తోంది. ఆ తాచు కాపరంవుండే పుట్టలాగా రోడ్డుచివర రోలరుంది. ఇసుక రేణువులు యెండలో మిలమిల్లాడుతూ సూర్యకిరణాలు అద్దం చూసుకుంటూన్నట్టుగా వుండే దాలమ్మ కళ్ళకి మాత్రం అది "ఎండితీగ నాగ" అన్పించింది.

రోడ్డు మధ్యలో గుంటల్ని తారు కలిపిన కాంక్రీటువేసి పూడ్చారు. రోడ్డు అంచుల్లోలేచిన పచ్చగడ్డి పీకి రోడ్డుతుడిచి అంచులుకట్టి సిద్ధంచేసివుంచింది దాలమ్మ.

చెయ్యి కాలకుండా గడ్డితో బకెట్ కాడ

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు...
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2x2 రుబియాలాన్సు
★స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ...... విజయవాడ-2.

డా॥ పి. వి. కె. రావ్, B. A..
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్సు స్పెషలిస్టు



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్కలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010

ఆరు గుళ్ళ ఆటోమేటిక్
ఇంగ్లీష్ మోడల్ పిస్టల్
లైసెన్సు అవసరంలేదు




దృఢమైన మెటల్‌తో ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో తయారుచేయబడింది. క్రూరమృగాలు మరియు దొంగల బారినుంచి మిమ్ము రక్షించును. మిరు మిట్లుగొలిపే మంట మరియు పెద్ద ధ్వని వెలువడుతుంది. ధర రు. 66-50 బెల్టుతో ఒరిజినల్ లెదర్‌కేసు మరియు 200 గుళ్ళు ఉచితం అదనపు ప్రతి వంద గుళ్ళకు రు. 5/- పోస్టేజి రు. 8-50 అదనం. ఆర్డరు నేడే పంపండి.
VENUS SALES (AJ)
Mahabir Ganj, Aligarh.

పట్టుకుని తారు రోడ్డుమీద స్ప్రే చేయ సాగాడు సన్నాసి "ఏటే దాలప్పా రోడ్డాంక అదే పనిగా సూత్తన్నావ్?" పరాచికాలు ఆడకుండా పనిచేస్తే అలు పొస్తుంది వాళ్ళకి.

అందంగా సూర్యకాంతిలో మెరిసే యిసుకలాంటి అమాయకత్వంతో పొర పాటున అగాధాల్లోకి జారిపోయిన అప్స రసలా వుంటుంది దాలమ్మ. పుల్లిగాడు కట్టిన తాళిబొట్టు, ఆడిచ్చిన బొట్టెడు కన్న బాబూ ఎదురుగుండా వున్నా సరే— "మగ జన్మ ఎత్తిన పెతీవోడూ, సిగూరికి అరవై ఏళ్ళ సింవాచెలంవరకూ అందరూ ఆకలిగా సూత్తారేటీ అప్పఏపు...." సన్నాసి పదహా రేళ్ళ కుర్రసన్నాసి కాబట్టీ దాలమ్మ వయిపు అసహ్యంగా పట్టి పట్టి చూసే వాళ్ళని గుండేసి పేల్చేయాలనుకుంటాడు. సన్నాసి మాటల్తో ఈ లోకంలోకొచ్చి పడింది దాలమ్మ. సన్నగా నవ్వుతూ "సూసావురా తమ్ముడా! రోడ్డు ఎంత బాగయిపోనాదో? సినిమా ఈరోయిను లాగా పిటపిటలాడిపోతాంది. ఏటి! ఇదంతా నిన్న మాపిటేలవరకూ గోతులూ గొప్పులూ బడిమాపిటేల్ల కాళ్ళు మట్టేసేది అదేనేంట్రా.... పట్టు పరుపు పరిసేసినట్టు తొంగొడోనాలనుందిరా— అదే సూత్తన్నా ఇసింత్రవని...." అంది.

"అప్పా! ఓ లప్పా...." సంతోషపడి పోయాడు సన్నాసి.

"ఏటో! నువ్వే ఈరోయిను నాగ కవుర్లు సెప్పేత్తన్నావ్. అవునే అప్పా! ఈ రోడ్డు నాటివే మన బతుకులు. నాలుగు డబ్బులు మనకాడుంటే మన బతుకుల్లో గోతులు పూడ్చుకోచ్చు. పట్టు పరుపేసుకుని తొంగొడొచ్చు...."

"యాయ్ దాలీ.... రోడ్డూడ్చి నావా— నిలబడిపోనావు. సన్నాసిగాడి పని కూడా పాడుజేత్తన్నావా. కవుర్లు సెప్తాంది సిలక. ఏరోయ్ సన్నాసి బాయ్యా.... కవుర్లు సాలిచ్చుకో. పన్జెయ్‌రా...."

మిక్సర్ చప్పుడు మింగేయటానికి శక్తి కొద్దీ గొంతుపెంచి అరిచాడు హుస్సేను. దాలమ్మని ఎదురుగా మరదలు వరుసపెట్టి పిలిస్తే, రౌడీ పుల్లిగాడి సంగతి గుండె అదరగొడుతుంది కాబట్టీ దాలమ్మని అప్పా అని పిలిచే సన్నాసిని 'బాయ్యా' అని పిలిచి ఆ కాస్త ఆనందాన్నీ పొందుతారు మగ కూలీలు. ఆ సంగతి తెల్సిన సన్నాసి 'బాయ్యా' అని పిలిస్తే తోకతొక్కిన తాచులా లేస్తాడు.

"ఆఁ- బాయ్యంట బాయ్య" గొణుక్కు న్నాడు దాలమ్మకి మాత్రం విన్పించేలా.

వీళ్ళసందట్లో వుండగా విజయ్ రోడ్డు

# కవి

మనసు పారిజాత వృక్షం
స్పందించిన క్షణం
అనుభవాల రాత్రుల్ని మించి జారిపడ్డ
స్వప్నాల్లా
పూల వాన
ఏ ఎండిన హృదయం చిగురించినా
ఈ వృక్షం తన జీవితమంతా
పూస్తుంది—

—పి. పావని

పక్కగా పాకుతూ వస్తోన్న నీడవెంట నడుస్తూ కాస్త ముందుకు ఒచ్చాకగానీ ఎవరూ చూడలేదు.

"అబ్బోసి! అబ్బాయిగారేటి ఇలా వచ్చీసినారు....,యానాది రోడ్డుమీద తారు కలిపిన చిప్పు గమాళా వంచబోతూ కొయ్యలా బిగుసుకుపోయాడు, అబ్బాయి గారంటే వాళ్ళ దృష్టిలో షోకిల్లారాయుడు. "అయినా పెద్దయ్యగారు సంపాదించిన లక్షలన్నీ ఏడు తరాలోళ్ళుకూకుని మేసినా ఎక్కా తక్కా" అన్నది వాళ్ళ నిశ్చితాభి ప్రాయం.

సన్నాసి ఖాళీ తారు బకెట్ పట్టుకుని బాయిలరు దగ్గరకెళ్ళేవాడల్లా రూటుమార్చి హుస్సేను దగ్గర కెళ్ళాడు. "ఏటీ! సత్తెవేఁ.... పెపంచకానికేదో కీడు మూడి వుండాల...."

ఆ పక్కనే నిలబడి హుస్సేన్‌తో పెపంచకం తీరుతెన్నులు గురించి చర్చా వేదిక నిర్వహిస్తోన్న పెద్దమేస్త్రీ రాయుడు పొగాకుకాడ పంచెలో సర్దుకుని పరిగెత్తాడు

"రండి బాబూ! ఏటి మాలాంటి దీన్ల మీద దయకలిగేసినాది మీకు, బగమంతుడు బెలుబాటము ఫాంటు ఏసుకుని, నలవ కళ్ళ జోడెట్టుకుని కారుమీన పయనమై ఒచ్చేసి నట్టున్నది బాబూ.... ఇజీబాబూ...." రాయుడు వినయంగా భక్తి పుట్టిపడుతూ చేతులు జోడించగానే చాలా చేతులు విజయ్ బాబుకి మొక్కాయి.

తనకి వాళ్ళందరూ ఇస్తోన్న ఘన స్వాగతానికీ- వాళ్ళందరి మొహాల్లోనూ తనపట్ల పుట్టిపడుతోన్న భయ భక్తులకీ విజయ్ లేత గుండెలో మంట తాత్కాలి కంగా చల్లారింది. తనచుట్టూ పేదగా దీనంగా చీమల బారులా వున్న ఆ జనం మధ్య తనహోదా చరచరా ఆకాశం

వరకూ పాకిపోయి అతని కళ్ళముందు తన రూపం ఓ సింహాసన మధిష్టించినట్టూ, అప్సరస్త్రీలు వింజామర వీస్తుండగా తన రాజ్యంలో ప్రజలు తమగోడు విన్పించుకునేందుకు వచ్చినట్టూ, వాళ్ళని వుద్ధరించడానికి కంకణం కట్టుకున్న అతి వుదార సమ్రాట్టులా దృశ్యాలు కళ్ళ ముందు తిరగసాగినాయి. విజయ్ మొహం లోకి కొద్దిగా ప్రసన్నత తొంగి చూసింది. దర్పంగా ముందుకి నడిచాడు. అంతే.... మెరుపు కొట్టినట్టు నిలబడిపోయాడు.

దాలమ్మ మోకాళ్ళ మీద కూర్చుని రోడ్డు అంచులు పేరుస్తోంది. పక్కలకి చెదిరిన తారు కలిపిన చిప్సుని సమంగా సర్దుతూ రోలర్ చదును చేయటానికి వీలు కల్పించుతోంది. కొద్దిగా ఒంచిన మొహంలో బుగ్గలు బంగారానికి నిప్పువేడి తగిలినట్టు తమాషాగా మెరుస్తున్నాయ్. చెవుల పక్కనించి గుండెల మీదకి పడుతోన్న వత్తయిన తలకట్టు, పమిట దాచలేని ఎత్తు గుండెలలోతు అతి సన్నటి గీతలా అస్పష్టమయే చీకటి లాంటి జుట్టు పాయల సందుల్లోంచి వెన్నెల పరుచుకున్నట్టుగా వుంది.

"చిన్నయ్యగోరంటే ఈరా?" జనం తప్పుకున్నాక తన సమీపానికివచ్చి ఆగిన తెల్లటిబెల్‌బాటమ్ ప్యాంటువెంట దాలమ్మ కళ్ళు క్షణంపాటు పైకి లేచాయి. బిడియంగా ఒక్కసారి తన కళ్ళతో కలిసి విడిపోయిన చూపులు విజయ్ గుండెల్లో అతి సున్నితమైనచోట గాలంవేసి లాగినట్లయింది. చిత్రమైన గగుర్పాటు పాకింది విద్యుద్ఘాతంలా.

విజయ్‌కి హఠాత్తుగా ఇది నిజమా? కలా? అనే సందేహం కలిగింది. చెయ్యి మీద గిల్లుకుని తేల్చుకోవాలని కూడా అనుకోసాగాడు. తను గంట క్రితం వరకూ చదువుతూ చదువుతూ ప్రతి అక్షరంలోంచి రంగుల్ని తీసి చిత్రించుకున్న వూహాసుందరి ఆ మాగజైన్ వదిలి తన కోసం వెతుక్కుంటూ రాలేదు కదా అన్నంత దిగ్భ్రమతో నిలబడిపోయాడు. విజయ్ కనుబొమల మధ్య ముడివీడిపోయి మొహం విరిసిన పువ్వులా కళకళలాడింది. అతని ప్రయత్నం లేకుండానే కళ్ళల్లోకి ఎర్రటి వెలుగు వొచ్చి నిలబడింది.

అసలే చాలీచాలని బట్టల్ని చమట వంటికి అతికించేసింది. తెగ బారెడు పట్టుని గుండెల మీదకి కప్పుకుని చిన్నబాబు చూపులు గుచ్చుకున్నట్టయ్ ఛటుక్కునలేచి నిలబడింది దాలమ్మ.


బెదిరిన లేడిలాంటి కళ్ళతో, కొద్దిగా

దూదిలా మెత్తని ఇడ్లీలు, నోట్లో వేసుకుంటే
కరిగిపోయే గారెలు చేయడం ఎలా?

# సోనోవిజన్,

ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

రేపటి పద్ధతులు చూడండి! వంట ఇంటిపని
సులభతరం చేసుకోండి.



Suvarna

"బాలజ్యోతి" చదవి ఆనందించండి!

# ఋణం లభించును

ఇందు మూలముగా సమస్త జనులకు తెలియజేయునదేమనగా మా క్లయింట్సు M/s SATNA SYNDICATE BANKER, Muktiyarganj SATNA-485 001 (M.P) బ్యాంకర్సు వ్యాపారం చేయుచు ఎటువంటి తనఖాలు, తాకట్టులు, హైపోతికేషన్లు, గ్యారంటర్లు లేకుండా కూడా, భారతదేశమంతట, చట్టప్రకారంగా ఋణములు యిచ్చుచున్నారు. ఋణములు: (i) టాక్సీ, ట్రక్కులు, ఆటోరిక్షాలు, బస్సులు, మోటార్ సైకిల్సు, స్కూటర్లు, పంపుసెట్లు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్సు, హార్వెస్టర్లు మొదలగునవి కొనుటకు (ii) వివాహములకు (iii) వ్యవసాయమునకు (iV) బావులను త్రవ్వుటకు (V) డైరీ, పౌల్ట్రీ, పిగ్గెరీ ఫారమ్‌లకు (Vi) ఇండస్ట్రీలకు (Vii) వ్యాపారములకు (Viii) కంట్రాక్టర్ షిప్‌లకు (iX) ఇండ్లు, సినిమాహాల్సు కట్టుటకు (X) ఫిల్మ్ ఇండస్ట్రీలకు (Xi) పెర్సనల్ లోన్లు మొదలగువానికి 10 సంవత్సరములలో సులభ వాయిదాలలో తీర్చే పద్ధతులలో లభించును. అప్పు పొందగోరువారు ఋణముల యొక్క విధానములను, నియమ-నిబంధనలను, లోన్ డాక్యుమెంట్సు మరియు పూర్తి మార్గదర్శకము (గైడెన్సు) నకును, రు. 20/-లు మనియార్డరు ద్వారా మా క్లయింట్సు M/s SATNA SYNDICATE BANKER నకు పంపి పొందండి. నియమ-నిబంధనలు మీకు అనుకూలంగా లేనిచో, డాక్యుమెంట్లు వాడకుండా తిరిగి పంపినవారికి పై రుసుము వెంటనే వాపసు చేయబడును.

(Strictly Without Prejudice)

S. S. PARIHAR, Advocate B. S. BISEN, Advocate
(M. P. High Court) SATNA. (M. P. High Court) SATNA.

పక్కకి చెదిరిన కుంకుమరేకలతో, కూలి పనిక అనుకూలంగా చకచకా నడిచేందుకు వీలుగా మోకాళ్ళ పైవరకూ లాగి బిగించిన చీరతో దాలమ్మ విజయ్ మత్తుకళ్ళకి శృంగార రసాధిదేవతలా కన్పించసాగింది

"సో సెక్సీ గాల్" విజయ్ ఆ ఆకర్షణా వలయాల్లో కొట్టుకుపోవడం మొదలు పెట్టాడు.

కూలీలని అదిలిస్తూ పని చేయిస్తోన్న రాయుడు ఇదంతా కనిపెట్టాడు. మునివంటితో చుట్ట కొన కొరికి వుమ్మేస్తూ దగ్గరగా వచ్చాడు. వుప్పుడీ గొడవ ఆపకపోతే ఇజ్జీబాబు ప్రాణాలకే ముప్పొస్తది అనుకుంటూ పైకి అన్నాడు :

"దాలే! నీ కొడుకుని ఆ మావిడిసెట్టు కింద తొంగొడెట్టావుగానీ. ఎల్లి సూడోపాలి పుల్ల సీమలు సరాసరి మీదెక్కేత్తన్నాయి. కుడితే సెందర్లోకం అవుపిత్తాదాడికి. ఎల్లి సూస్కోఫా...." దాలమ్మ బ్రతుకు జీవుడా అనుకుని రాయుడుకి మనసులోనే దణ్ణాలు పెట్టుకుంది. చివ్వున లేచి ఛప్పున వెనక్కి తిరిగింది. ఆ అదటుకి గుండెల క్రిందకి వ్రేలాడుతోన్న జుట్టు ముడివూడి నడుం కిందకి జారుతూ నీలి కాంతులు చిమ్మింది. ఈసారి ఆ మెరుపుల్లో తళుక్కుమనే శిఖరాల్లా ఆ ఎత్తు గుండెలు విజయ్ గుండెని పూర్తిగా పాదాక్రాంతం చేసుకున్నాయ్.

ఆ ఒక్కరోజే కాదు, వరసగా వారం నించీ సరిగ్గా ఇంకా కూలీలు రాకుండానే విజయ్‌కారు 'సైట్'లో ప్రత్యక్షం. దాలమ్మకి దగ్గర్లో నిలువునా ఎండలో మాడుతూ నిలబడే వుంటాడు. అతన్లో వచ్చిన మార్పుకి తల్లీ తండ్రీ యెంతగానో విస్తుపోయారు. జగదాంబగారికి చూడగా చూడగా కొడుకుని చూసి నలుగురూ దిష్టికొట్టరుకదా అన్పించింది ఆ తల్లి ప్రాణానికి. అందుకే ఆవిడ తరచూ "ఆఁ- ఏం వుందర్రా వింత, విడ్డూరమూను? పాతికేళ్ళు పైబడుతున్నాయి. చిన్న కుంకేంకాదు, బాధ్యత తెలిసొచ్చినట్టుంది. ఏపెల్లకాలం ఒక్కలాగే వుంటారా?" అనడం మొదలుపెట్టింది. వినేవాళ్ళు నిర్ఘాంతపడేవారు.

"మా విజయ్‌బాబుకి మొన్న పుట్టిన్రోజుతో పదహారు వెళ్ళినట్టున్నాయో, వచ్చినట్టున్నాయో— సరిగ్గా ఏదో నాకు తెలీదు మా లోకం. వెళ్ళడంకాదులే- పదహారొచ్చాయి పదిహేనెళ్ళి" అనేది ఆరడుగుల పొడుగూ ఒడ్డూ, గడ్డాలూ మీసాలు వచ్చిన కొడుకుని చూసుకుంటూ. "అల్లాంటిది ఈ నాలుగు రోజుల్లో అన్నేళ్ళు వచ్చేసినట్టున్నాయ్" నవ్వుకునేవారు చాటుగా.

ఈ వారం రోజులూ దాలమ్మ గుండెల మీద ఇనప పాదాల్లా తొక్కుతూ కాలం కదలటం కష్టమైంది. విజయ్‌ని తప్పించుకు తిరగటం ఒక యెత్తయితే సాటివాళ్ళ చూపుల్లో హేళనకి తట్టుకోడం మరో ఎత్తుగా వుంది. విజయ్ పూటకో డ్రస్ వేసుకుని మన్మధుణ్ణి మరిపిస్తోంటే జట్టులో ఆడపిల్లలు పమిట్లుజార్చేసుకుంటున్నారు. అతను రాసుకునే ఫారిన్‌సెంటు సెగలు క్రక్కే వేడిగాలిని చల్లబరుస్తూ వట్టివేళ్ళ చల్లదనమంత ఆహ్లాదం కలిగిస్తోంది. బట్టలకి తగిన లేతరంగు చలవ కళ్ళద్దాలపాటి చెయ్యవుకదా మన బతుకులు. 'ధూత్ నీయవ్వా' అనుకుంటున్నారు మగ కుర్రకారు. విజయ్ ఖరీదయిన షర్టు జేబుల్లోంచి వంద రూపాయల నోట్లు జారి తన దగ్గరే ఎందుకు పడతాయో అర్థమయ్ దాలమ్మ ప్రాణం సిగ్గుతో చచ్చిపోతోంది.

"ఇంత చక్కదనం నాకెందుకివ్వాల దేవుడా! కలిగినోరి కన్నెలకిత్తే గాజుబొమ్మల్లా బద్రంగా బీరువాల్ల వుంటారు. రోడ్డు పక్కన బతికేవోల్లకెందుకురా" అని కన్పించని దేవుణ్ణి శపించుకుంది. ఈ అందం మూలంగా జీవితంలో ప్రతిక్షణం వేటాడబడుతున్నట్టుగా బతకటం కత్తిమీద సాములా వుంది దాలమ్మకి. ఆదరాబాదరా నాలుగు మెతుకులూ సత్తు కారేజీలో సర్దుకుని ఇంత గంజి వంచుకుంది. ఓ ఉల్లిపాయ, వో ఎండుమిరపకాయ, వుప్పుగల్లూవేసి దంచి ఆ వర్ర ఆకులో చుట్టచుట్టి కారేజ్‌లో పడేసి మూత బిగించింది. వాకిట్లో పాక ముందు నీళ్ళు పోసుకునే తొట్టి పట్టుకుని నిలబడి నీళ్ళల్లో చెయ్యిముంచి తీసి కేరింతలు కొడుతోన్న కన్నబాబుని చంకనేసుకుంది. గుడిసె తలుపు జేరేస్తుంటే ఎదురుగా గోడకి వేలాడుతోన్న అద్దంలో తన మొహం చందమామలా తళుక్కుమనటం చూసుకుని దాలమ్మ కించపడింది. "పని కెల్తావుంటే యములోరి కొలువు కెల్తున్నట్టే" వుంది. విజయ్ ముహం చూస్తే చంకలో కొడుకుని చూసినట్టే వుంటుంది దాలమ్మకి. కానీ రోజు రోజుకీ ముదిరిపోతోన్న విజయ్ మోహం – "ఆ బాబు సూపులూ, నవ్వులూ, పరాసికాలు.... కావంతో పొరలు గప్పేసిన ఆ కళ్ళూ" గుర్తుకొస్తే దాలమ్మ శరీరం ముడుచుకుపోతోంది. "ఏం పాడుబుద్ధిరా బాబూ.... నా తమ్ముడంత ఒయసుంటది. అంతే. బగమంతుడా ఆ బాబుని కాత్త మంచిగ నడిపిచ్చవా...." కళ్ళ నీళ్ళు జారటం దాలమ్మ గమనించనే లేదు.

"కట్టుకున్నోడికి తిరం నేకపోయాక బతుకిట్టాగే కుక్కలు సింపిన ఇస్తరవుతుంది. ఆడికి రేప తాగడానికి పైసలు రాల్చకపోతే తన్నులు తప్పవు. ఎదవ పేనమని, ఇసిగి వురేసుకుందారంటే బొట్టిడి మొగం బందాలవుతంది...." సన్నగా గొణుక్కుంటూ దారి పట్టింది. దాలమ్మ

శబ్దార్థ చంద్రిక



ఆ జట్టులోనే పని చేయటానికి ఓ ముఖ్యమైన కారణం వుంది. ఆ జట్టు పెద్ద మేస్త్రీ రాయుడు చాలా మంచివాడు. దాలమ్మ వాడి జట్టులోకి చేరాక తనకి బాగా కలిసొచ్చిందని పిచ్చినమ్మకం. దాలమ్మని వదలటానికి ఒప్పుకోడు. తను మొదలెట్టే ప్రతీ పనికీ ముందు దాలమ్మ చేతే కొబ్బరికాయ కొట్టిస్తాడు.

తోబుట్టువులా చూసుకునేరాయుడు. పుల్లిగాడి రౌడీతనం, దాలమ్మని క్రూర మృగాల వాత పడకుండా కాస్తోన్న ఆయుధాలు.

రేపటితో పని ముగుస్తుంది.

ఇవ్వాళయినా తన పని సాధించుకోవాలని పట్టుదల రేగుతోంది.... విజయ్ గుండెల్లో ఒక మూల ఈ అపజయానికి కసి లాంటిది సుడిలా తిరుగుతోంది. 'ఆఫ్టరాల్ ఆడది.... కూలి ఆడది. హుఁ— దీన్ని లొంగదీసుకోడానికి ఇన్ని రోజులా? డామ్ ఇన్‌సల్ట్.... ఇది తన మగతనానికే సవాల్." రెట్టించిన ఆగ్రహంతో సమయంకోసం చూస్తున్నాడు విజయ్.

భోజనాల విరామంలో గుంపులో దాలమ్మ కన్పించక పిచ్చెత్తి అంతటా వెతికేశాడు విజయ్. తీరా చూస్తే మావిడి చెట్టు బోదెని ఆనుకుని అటువయిపుగా కూర్చుని బిడ్డకి పాలు కుడుపుతోంది దాలమ్మ. ఒళ్ళో బిడ్డ పాలు తాగుతూ తాగుతూ తల్లి మొహంలోకి చూసి కిలకిలా నవ్వుతున్నాడు. ఒంగి బిడ్డని ముద్దుపెట్టుకుంటోన్న దాలమ్మ మొహం దీప్తివంతంగా వుండి. ఆ గుండెలు మాతృగర్వంతో పొంగి పూర్ణచంద్ర బింబాల్లా వున్నాయి. ఒక్కసారి ఆ మొహంలోకి చూసివుంటే విజయ్ తనలో చిందులేస్తోన్న కామపిశాచిని తరిమేవాడే! తన నీచత్వానికి తప్పకుండా సిగ్గుపడి వుండేవాడు. కానీ అతని దృష్టి స్వేచ్ఛగా నగ్నంగావున్న ఆ ఎత్తు గుండెల మీద వుంది. పిల్లడు తడుపుతాడని పైకి లాక్కుని ఆచ్ఛాదన లేకుండావున్న కాళ్ళ చివరివరకూ పాకుతోంది. పిచ్చివాడిలా అల్లా ఎంతసేపు నిలబడిపోయాడో తెలియదు. నిద్రపోయిన కొడుకుని చింకి బొంత మీద పడుకోబెడుతూ అదాటుగా విజయ్ కన్పించి గబగబా బట్టలు సర్దుకుంది. దాలమ్మ గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. ఛటుక్కున నిలబడి పరుగందుకుంది.

విజయ్ సిద్ధంగా జేబులోంచి తీసి పట్టుకున్న వందలనోట్లు కసిగా జేబులో కుక్కుకున్నాడు. కాలికడ్డంవచ్చిన ఇటుక ముక్కని లాగితన్ని రోడ్డెక్కాడు.

ఇంకో గంటన్నర తర్వాత....

"ఏటీ! పని సరిగ్గా సాగట్లేదు...." రోలర్ డ్రైవరు రావుడు చిరాగ్గా "నీయవ్వ" అనుకుంటూ దిగొచ్చాడు.

"ఎట్టా రావయ్యా.... ఏం గావాల నీకు.... బాబ్బాబూ బండి దిక్కురా నాయనా"- రాయుడు పరిగెత్తుకొచ్చాడు.

"ఏచేటి? యెంతసేపు నశపాల రోలరు. తొక్కనోచే తొక్కుతా రోడ్డుమీద తారు చల్లడానికే సరిపోతంది కాలవు..."

"ఏరోయ్ సన్నాసోడా? ...."

ఆ మాటలకి రాయుడు నోట్లో ఎర్రగా వెలుగుతోన్న చుట్టకొన అంటుకున్నట్టు


# ADMISSIONS

## B.Sc., Engineering,

Seats in Bihar. for minimum pass marks in Inter.

## B.Ed.,

Correspondence course without any restriction in Nellore, Hyderabad Centres. (All graduates eligible) for '82 Examination.

## B. A., / B. Com.,

Direct final Oct '81 Exam., with pass guarantee for S.S.L.C. 's/S. S. C.'s (Postal only)

## Higher Secondary (M.P.)

for S. S. L. C. / S. S. C. failed.

Hostel attached. Oral & Postal. Prospectus Rs. 5/- M.O.

Phone : 447342.

## USHA EVENING COLLEGE,

45, South Usman Road, T. Nagar. **Madras-17.**

Branch : Bakaram Road, Musheerabad, **Hyderabad-48**

## శబ్దార్థ చంద్రిక




సన్నాసిలో కోపం భగ్గుమంది.

"బాయిలరు మైలు దూరాన్నుండె.... ఎట్ల తేవాలే.... సెయ్యికాలి పుల్లువడ్తాండె. మల్ల ఆటి మీన మరుగుతారు పడతాంటె ఎట్లుండేది ఎరికేనా ??"

"అట్లయితే బాయిలరు ఇంకా ముందు కీడ్సుకోవాలె.... ఎరికేనా ?" రాయుడు సన్నాసిని వెక్కిరిస్తూ అనేసరికి అందరూ పకపకా నవ్వేశారు. సన్నాసి తలొంచుకుని కాళ్ళు తొక్కుకుంటూ సిగ్గుపడ్డాడు.

"జరతెలివుండాలె. అట్ల మొగం దించుకోక. బాయిలరు ఇంగా ముందుకీడ్వమని జర సెప్పరాదుండే.... నీ బాంచెను.... కాల్మొక్తా...." యానాదికి వుషారొచ్చి నవ్వించాడు. మెల్లగా తారు బాయిలరు చుట్టూ మోకులు కట్టి నడిపించసాగారు. పిశాచి శవంలా భారంగా కదిలింది. చెట్టు వరకూ వచ్చాక తాళ్ళు లాగటంలో ఎవరు ఏ లాగకూడని తాడు లాగారో. ఎవరు గట్టిగా పట్టివున్న ఏ బంధాన్ని సడలించారో, పైనించి ఏ కనబడని దుష్టశక్తులు బలి అడిగాయో తెలీదు- బాయిలర్ అంతెత్తుది ఫటుక్కునశబ్దం చేస్తూ వొరిగింది. ఒరుగుతూనే. అంతలావు కుళాయిమరా తిరిగింది. అంతే-వేడివేడి మరుగుతారు భళ్ళున బద్దలయిన పాపంలా పొంగి పొర్లింది. నాలుగు మూలలకీ నిప్పులూ. మండుతూన్నకట్టెలూ చెల్లాచెదురయ్యాయ్ ఒక్కసారిగా హా హా కా రా లు మిన్ను ముట్టినాయ్. స్టీరింగ్‌కి తలాన్చి కూర్చున్న విజయ్ గబగబా కారుదిగి పరుగెత్తుకొచ్చాడు. మూగిన జనంలో ఎవరో ఆకుపచ్చ బొంతముక్క గుర్తుపట్టారు. "హమ్మో! దాలో నీబిడ్డ సచ్చిపోయాడే.. రాయే-" దాలమ్మ పిచ్చిదానిలా పేరుకున్న తారు చూసింది. అడుగునించి ఆకుపచ్చ బొంతముక్కలు తొంగి చూడ్డం చూసింది. విరుచుకుపడిపోయింది. తెలివొచ్చాక ముత్తమ్మ ఒళ్ళోంచి ఒక్కవుదుటున లేచింది. చెట్టు దగ్గిర చేరిన జనం పట్టుకు ఆపుతున్నారు. ఓదారుస్తున్నారు.

"మా అమ్మవికదూ.... దెయిన్నం తెచ్చుకోలమ్మా.. వూరుకో తల్లీ.ఏడకు - ఏడకమ్మా - ఏడకు -" విజయ్ హతాశుడిలా చూస్తున్నాడు. దాలమ్మ కళ్ళల్లో మహానదులుచూస్తున్నాడు. ఆ మొహంలో సర్వస్వం కోల్పోయిన తల్లి ప్రాణం చూస్తున్నాడు. తారు సమాధి అడుగు కంటా వెళ్ళి బిడ్డ గొంతు తడపాలని గుండెల్లోంచి చివ్వున ఎగిసిన పాల ధారల్లో మమతని చూస్తున్నాడు. ప్రతీ మనిషి వెనకాలా, ప్రతి ప్రాణీ ఎదిగి యెగిరేవరకూ యింత సృష్టినీ తను చూడలేనని దేవుడు దీవించి యిచ్చిపంపిన అమ్మని చూస్తున్నాడు. కన్నబిడ్డ కాలెత్తి తన్నినా, కరుణగా ఆ కాలు ఒత్తే ఆలయ శిఖరాల్లాంటి ఆ గుండెల్ని చూస్తున్నాడు.

విజయ్ చుట్టూ కోటానుకోట్ల ప్రతిబింబాలయ్ దాలమ్మ, ఆమె బిడ్డా తిరుగుతున్నారు. క్షణం క్రితంవరకూ విజయ్ కళ్ళల్లో బుసలుకొట్టిన కామాగ్ని పశ్చాత్తాప వర్షం చినుకులు పడి చల్లారింది. సంస్కారం. సంస్కృతి తెలియజెప్పిన చరిత్ర పుటల్లోంచి స్త్రీ రూపం అతని గుండెల్లో పాశవికతని చీల్చి చెండాడుతోంది. విజయ్ కళ్ళముందు దృశ్యాలు ఎక్కడో ఎప్పుడో చదివింది అది- ఒక వ్యక్తిపై రాజద్రోహ నేరం ఆపాదించి నడి వీధిలో రథానికి కట్టి ఈడ్చి, కొరడాలతో చావగొట్టి మండు టెండలో వదిలేసి వెడుతూ ఆ వ్యక్తికి ఒక్క మంచినీటి చుక్కకూడా ఇవ్వరాదనీ, అట్లా చేసిన వ్యక్తికికూడా అలాంటిదే దండన విధించబడుతుందనీ హెచ్చరించి వెడతారు రాజసేవకులు. మూగిన గుంపులోంచి ఓ యువతి ముందుకు వస్తుంది. బాలింతరాలు ఆమె. దాహమని అలమటిస్తోన్న ఆ అనామకుడి మొహాన్ని గుండెలకి చేర్చుకుని రక్తం చిమ్ముతోన్న ఆ పెదవులకి తన స్తన్యమందిస్తుంది. బిడ్డగా పాలు కుడుపుతుంది.

"అహా! తల్లిగా, కూతురుగా, భార్యగా, స్త్రీ.... మగవాడు ఎన్ని తప్పులు చేసి వచ్చినా సహనశీలియై క్షమారూపియై జగతిని పరిపాలిస్తోందీ.... అలాంటి స్త్రీ మూర్తిని తనెంత నీచంగా చేరాలనుకున్నాడూ? ఎన్ని భంగిమల్లో వూహించుకుని, ఎంత హేయంగా చెరచాలనుకున్నాడూ? అయ్యో- ఇంతటి నీచత్వం నాకెందుకు యిచ్చావు దేవుడా.... అయ్యో నేనెంత పాపినీ. అమ్మలాంటి ఆడదాన్ని...." విజయ్ మెదడులో గిరగిరా తిరుగుతూన్న వస్తువేదో ఆగిపోయింది. ఒరిగిపోతూ అరిచాడు 'అమ్మా'....

"సినబాబు పడిపోతున్నాడు. అయ్యో పట్టుకోండి.... పట్టుకోండి" దాలమ్మని ఒదిలేసి తాత్కాలికంగా ఆ సంగతి మర్చిపోయి విజయ్ చుట్టూ మూగారుఅందరూ.

ముసలి ముత్తమతే చేతుల్ని తప్పించుకుని పరిగెత్తింది దాలమ్మ. చెట్టు క్రింద అడుగు ఎత్తున పేరుకుంది తారు- నల్లగా పిల్లడు చల్లగా పాలుతాగి సుఖనిద్రపోతోన్న ఆనమాలయినా కన్పించకుండా నిలబడి ఇంకా హుస్సురంటూ పొగలు చిమ్ముతోంది. తన చల్లని ఆశ్రయం క్రింద ఇంత ఘోరం జరిగిందేమా అని ఒణికిపోతూ ఆకులు కదల్చటం మానేసింది చెట్టు. ఒరిగిపోయిన బాయిలర్‌లోంచి చుట్టూ చెదిరిపడిన ఎర్రటి బొగ్గులు కణకణా మెరుస్తూ ఆ సమాధిమీదకి దేవతలు ఆకాశంలోంచి రాల్చిన ఎర్రగన్నేరుల్లా వున్నాయ్. బిడ్డకోసం పిచ్చిదవుతూ చేతులుజాచిన ఆతల్లి నిలువెత్తుగా పగిలిన గుండెలతో ఇంకా రోదిస్తూనేవుంది పడమట సంధ్య బిక్కమొహం వేసుకుంది.